సాక్షి విశాఖపట్నం

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



సరికొత్త కాన్సెప్ట్‌తో పాప్‌కార్న్

పాప్‌కార్న్ చిత్ర యూనిట్ విశాఖలో సందడి చేసింది. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా అందరిని ఆకట్టుకుందని పేర్కొంది. 8లో



కంపెనీ సెక్రటరీ.. కార్పొరేట్ కింగ్

యువతకు భవిష్యత్ అందించే కోర్సుగా కంపెనీ సెక్రటరీ నిలుస్తోంది. ఏయూ వేదికగా ఐసీఎస్ఐ ఈ సేవలు అందిస్తోంది. 8లో



శునకాల 'షో'కు 8లో

ఎంజీఎం పార్క్ ప్రాంగణంలో నిర్వహించిన డాగ్ షో అలరించింది. జంతు ప్రేమికులు తమ శునకాలతో ఈ షోలో పాల్గొన్నారు.

పున్నమి వేళ.. పోటెత్తిన భక్తులు

సముద్ర తీరంలో మాఘ పౌర్ణమి పూజలు



అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం తీరంలో స్నానాలు ఆచరిస్తున్న అశేష భక్తజనం

బీచ్‌రోడ్డు: మాఘ పౌర్ణమి సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని తీరాలు జనసంద్రంగా మారాయి. ఈ ఏడాది పవిత్ర పౌర్ణమి.. మాఘ మాసం ఆదివారం రావడంతో మరింత విశిష్టతను సంతరించుకుంది. దీంతో భక్తులు బీచ్‌లకు చేరుకుని ఆచార సంప్రదాయాలతో పుణ్యస్నానాలు ఆచరించారు. పలువురు పితృదేవతలకు తర్పణాలు వదలడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. మాఘ పౌర్ణమి రోజున పుణ్య స్నానం చేసి సూర్యభగవానుడికి పూజలు చేయడం, దాన ధర్మాలు చేస్తే పుణ్యఫలాలు లభిస్తాయని భక్తులు తెలిపారు.



ఆర్.కె.బీచ్‌లో స్నానాలు చేసి సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు





న్యూస్‌రీల్

కంచి పీఠాధిపతిని దర్శించిన మంత్రి అమర్‌నాథ్



విజయేంద్ర సరస్వతిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

సీతంపేట: శంకరమఠంలో విడిది చేసియున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం దర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్వామివారు, అమర్‌నాథ్ చర్చించుకున్నారు. అనంతరం విజయేంద్ర సరస్వతి పలు విలువైన పుస్తకాలను అమర్‌నాథ్‌కు అందజేశారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు ఉన్నారు.

బ్యాడ్మింటన్ స్టేట్ చాంపియన్‌గా ఉషశ్రీ



ద్వారకానాథ్ చేతుల మీదుగా చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ బ్యాడ్మింటన్‌లో స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ కడప ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 45 ప్లస్ కేటగిరీలో సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఉషశ్రీ రెండు టైటిల్స్ గెలుపొందారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందుకున్నారు. రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌ను గెలుచుకున్న ఉషశ్రీ మార్చి 19 నుంచి గోవాలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారు. నేషనల్స్‌లో గెలుపొంది ఇంటర్నేషనల్ టైటిల్ సాధించడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న నసిరుద్దీన్

డాబాగార్డెన్స్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముస్లింలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని ముస్లిం రాజకీయ చైతన్య వేదిక డిమాండ్ చేసింది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వేదిక రాష్ట్ర కన్వీనర్ నసిరుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. కోస్తాంధ్రలో 25 ఏళ్లుగా ఒక్క ముస్లిం ప్రజాప్రతినిధి కూడా లేడని.. 30 ఏళ్ల కిందట కాకినాడ నుంచి కాంగ్రెస్ ఓ ముస్లిం లాయర్‌కి సీటు ఇచ్చిందని గుర్తు చేశారు. అప్పట్లో ఆయన రెండవ స్థానంలో నిలిచారన్నారు. 28 ఏళ్ల కిందట వైజాగ్‌లో ముస్లిం ఎమ్మెల్యేను గెలిపించారన్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో మినహా శాసనసభ, పార్లమెంట్‌కు అవకాశం లేకుండా అన్ని పార్టీలు విస్మరించాయన్నారు. అన్ని పార్టీలు ముస్లిం నాయకత్వాన్ని చట్ట సభలకు దూరం చేస్తున్నాయని విమర్శించారు. ఏ పార్టీ అయితే రాష్ట్రంలో ఎక్కువ శాతం ముస్లింలకు ప్రాధాన్యం కల్పిస్తుందో.. ఆ పార్టీని గెలిపించుకునేందుకు ముస్లిం రాజకీయ చైతన్య వేదిక కృషి చేస్తుందన్నారు. సమావేశంలో షేక్ సలీం, ఎండీ హనీఫ్, ఇమ్రాన్ హుస్సేన్, జహంగీర్, షరీఫ్, వల్లీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

విశాఖ విద్య: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ప్రవేశ పరీక్ష రాసేందుకు 2,080 మంది దరఖాస్తు చేసుకోగా, నగరంలో 7, భీమిలిలో 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 1,977 మంది హాజరు కాగా, 103 మంది గైర్హాజరు అయినట్లు డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. నగరంలోని ఐదు పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు.

కార్గో రవాణాపై నిఘా!

- అడ్డగోలు సరకు రవాణాకు అడ్డుకట్ట
- ఇటీవల రేషన్ బియ్యంతో పట్టుబడ్డ డీజీటీ
- అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు
- బుకింగ్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, సిబ్బందికి హెచ్చరిక



ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఆర్టీసీ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో ఆర్టీసీ కార్గో బస్సులో రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇకపై అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి నిఘా పెట్టనుంది. అంతగా తనిఖీల బెడద ఉండదన్న ఉద్దేశంతో అక్రమార్కులు ఆర్టీసీ కార్గో బస్సుల్లో నిషేధిత, అక్రమ సరకు రవాణాను ఎంచుకుంటున్నారు. కాంట్రాక్టర్లు, ఏటీబీ (ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్) ఏజెంట్లకు కూడా సరకు రవాణా బుకింగ్ సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. దీనిని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఒక సరకు పేరు చెప్పి మరొక సరుకును రవాణా చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పట్టుబడిన డీజీటీ వాహనంలో నూకలు పేరు చెప్పి రేషన్ బియ్యాన్ని రవాణా చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత డీజీటీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్, కంట్రాక్టరు ఉన్నట్టు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కార్గోలో సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమ పిండి, దుస్తులు, మందులు, నూకలు వంటివి రవాణా జరుగుతోంది.

కొందరు అడ్డదారులు తొక్కడంతో..

ఇప్పటికే ఆర్టీసీ కార్గో సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఫలితంగా ఆదాయం బాగానే సమకూరుతోంది. దీంతో ఈ కార్గో వ్యవస్థను మరింత విస్తృతం చేయాలన్న యోచనలో ఉంది. ఇలాంటి తరుణంలో సరకు రవాణాలో కొందరు అడ్డదారులు తొక్కడం ఆర్టీసీ ఉన్నతాధికారులను కలవరానికి గురి చేస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఈ కార్గో వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావిస్తోంది. అందుకే ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్లు/డీజీటీ (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు)ల్లో సరకు బుకింగ్, రవాణాలపై గట్టి నిఘా పెట్టాలన్న నిర్ణయానికొచ్చింది. వీటిలో రేషన్ బియ్యం, తలవెంట్రుకలు, చేపలు, మద్యం తదితర వాటితో పాటు నిషేధిత సరకులు/వస్తువులను అనుమతించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. దీనిపై సంబంధిత ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, ఆర్టీసీ సిబ్బందికి ముందుగా సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం, హెచ్చరికలు జారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి అక్రమ రవాణాలో భాగస్వామ్యం ఉన్న వారిని ఉద్యోగాల నుంచి తొలగింపు వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, బాధ్యులైన ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్ల ఏజెన్సీలను రద్దు చేయడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ 'సాక్షి'తో చెప్పారు.

మధురవాడ-హైదరాబాద్ బస్సు రద్దు

మరోవైపు గంజాయి అక్రమ రవాణా బెడద కూడా ఆర్టీసీకి ఉంది. మధురవాడ నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సులో గంజాయి రవాణా చేస్తున్నట్టు వెలుగు చూసింది. నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు, చింతూరు, వీఆర్‌పురం, నేరెళ్ల, ఎటపాక, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల మీదుగా ఈ బస్సు ప్రయాణిస్తుంది. అక్రమార్కులు ఈ బస్సును గంజాయి రవాణాకు అనువుగా మలుచుకున్నారు. పలుమార్లు దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో ఆర్టీసీ అధికారులు ఇటీవల ఆ బస్సు సర్వీసును రద్దు చేశారు.

ఖాకీ..కోడి..కథాచిత్రమ్!

- ఇన్‌స్పెక్టర్ పేరుతో కానిస్టేబుళ్ల దందా
- ఆ స్టేషన్ పరిధిలో వ్యాపారులను దోచుకుతింటున్న ఖాకీలు
- చికెన్ నుంచి రైస్‌బ్యాగ్‌లు, మసాలాల దోపిడీ
- సీఐ వ్యవహార శైలీ వివాదాస్పదమే..
- బయటకు చెప్పలేక ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): అయ్యగారు పార్టీ ఇస్తున్నారు. 5 కిలోల చికెన్ కొట్టి ఇవ్వు.! ఓయ్.. ఇన్‌స్పెక్టర్ గారి ఇంట్లో ఫంక్షన్.. నువ్వు బియ్యం బస్తాలు ఇవ్వాలి.! ఇదిగో.. మా సార్ కోసం మసాలా ఐటమ్స్ కట్టేసి బ్యాగ్‌లో పెట్టు.! ఇదీ నగర శివారు ప్రాంతమైన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుళ్ల దందా..

సీఐ పార్టీ ఇస్తున్నారని చెప్పి.. ఆ స్టేషన్ పరిధిలోని చికెన్ షాపుల నుంచి కిరాణా షాపుల వరకు ప్రతి ఒక్కరినీ దోచుకుతింటున్నారు ఖాకీలు. కొంత మంది కానిస్టేబుళ్లు ఉదయం నుంచే బ్యాగులు పట్టుకుని షాపుల మీద పడ్డారు. చికెన్ షాపుల వద్దకు వెళ్లి సీఐ ఇంట్లో ఫంక్షన్ ఉందని ఒకరు.. సీఐ పార్టీ ఇస్తున్నారని మరొకరు చెప్పి 2 కిలోల నుంచి 5 కిలోల వరకు డబ్బులు ఇవ్వకుండా పట్టుకుపోయారు. రోజు వారి వ్యాపారంపై జీవనం సాగించే ఇటువంటి చిన్న వ్యాపారుల నుంచి కిలోలకు కిలోలు చికెన్ కొట్టీయడంతో వారు బయటకు చెప్పుకోలేక మదనపడుతున్నారు. అలాగే రిటైల్ దుకాణాలకు వెళ్లి రైస్ బ్యాగులు, ఇతర వంట, మసాల సామాన్లు సైతం కట్టించుకుని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారు.

ప్రతిసారీ అదే తంతు

ఈ స్టేషన్ సిబ్బంది వ్యవహారం పట్ల స్థానిక వ్యాపారులు విసుగెత్తిపోతున్నారు. ఖాకీ డ్రెస్ ఉందన్న కారణంతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సీఐ పేరు చెప్పి సాగిస్తున్న ఈ దందా నిజంగా ఇన్‌స్పెక్టర్ కోసమా? లేదా కానిస్టేబుళ్ల నిర్వాకమా? అన్నది తేలాల్సి ఉంది. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి మార్కెట్ దందా చేయడంలో ఈ స్టేషన్ పరిధిలో సిబ్బంది సిద్ధహస్తులుగా పేరుపొందారు. చిరు వ్యాపారులు, దుకాణదారుల నుంచి ఉచితంగా సామాన్లు పట్టుకుపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరి వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నా.. ఆ తర్వాత మిగిలిన వారు తమపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తారన్న భయంతో వ్యాపారులు బహిరంగంగా చెప్పలేకపోతున్నారు.

సీఐ వ్యవహార శైలి అంతే..

ఈ స్టేషన్ సీఐ వ్యవహారం ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటోంది. విందులు, వినోదాలపై అమితాసక్తి ఉన్న ఈ అధికారి పనిచేసిన చోటల్లా ఏదో వివాదంలో చిక్కుకుంటూ వస్తున్నాడు. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారుల నుంచి మందలింపులతో పాటు ఓ మహిళ వివాదం విషయంలో సస్పెన్షన్‌కు సైతం గురయ్యాడు. అయినప్పటికీ అతని వ్యవహార శైలిలో ఎటువంటి మార్పు రాలేదని సహచర సిబ్బందే చెబుతుండడం గమనార్హం. ఓ అతిథి గృహంలో పార్టీ కోసమే కానిస్టేబుళ్లు మార్కెట్‌లో దందాకు దిగారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే నిజంగా సీఐయే కానిస్టేబుళ్లకు చెప్పి పంపించాడా? లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఇటువంటి సిబ్బందిపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

రాజకీయాలనూ మహిళలు శాసించగలగాలి

'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' సదస్సులో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం: రాజకీయాలను మహిళలు శాసించగలగాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పిలుపునిచ్చారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో విశాఖలో 'షీ ఈజ్ ఏ ఛేంజ్ మేకర్' పేరిట ఆదివారం నిర్వహించిన 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' రెండో రోజు సదస్సులో మాట్లాడుతూ.. మహిళలు రాజకీయాల్లో రాణించడమంటే సప్తసముద్రాలు ఈదడం వంటిదన్నారు. అయితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవ కారణంగా రాజకీయాల్లో మహిళలు రాణించడం సులువైందన్నారు. సరైన వేదిక.. సరైన ప్రోత్సాహం లేకపోతే ఇంటా, బయటా రెండింటా మహిళలు రాణించడం అత్యంత కష్టమైన పని అన్నారు. ఇలాంటి వారందరికీ ఏపీలో జగనన్న రూపంలో మనసున్న నాయకుడు లభించారన్నారు. పెద్ద పెద్ద కుటుంబాలు, పెద్ద పెద్ద నాయకుల వారసత్వం పొందిన మహిళలకు మాత్రమే పదవులు దక్కుతాయని.. వైఎస్ జగన్ మాత్రం అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళల్ని రాజకీయాల్లో రాణించేలా చేశారన్నారు. ఆడపిల్లల భద్రత కోసం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టాన్ని ఇప్పటికీ కేంద్రం ఆమోదించకపోవడం దురదృష్టకరమన్నారు.

నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించేందుకే..

నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ ఈడీ దిశా పన్ను, సెంటర్ చీఫ్ ప్రోగ్రామ్ అధికారి అంజలి చౌహాన్ మాట్లాడుతూ.. అన్ని స్థాయిల్లో మహిళా ప్రతినిధుల నాయకత్వ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కమిషన్ ఆధ్వర్యంలో పాన్ ఇండియా సామర్థ్య నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మంగళవారం జరిగే ముగింపు సదస్సుకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరుకానున్నారు.

లింగ సమానత్వంతో మహిళల ఎదుగుదల

నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ ఈడీ దిశ పన్ను

కొమ్మాది: లింగ భేదం లేకుండా స్త్రీ పురుషులను సమానంగా చూసిన నాడే మహిళా నాయకులు సహజ ఎదుగుదలకు అవకాశం ఉంటుందని నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిశ పన్ను అన్నారు. నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సహకారంతో రుషికొండలోని రాడిసన్ బ్లూలో నిర్వహిస్తున్న 'షీ ఈజ్ ఛేంజ్ మేకర్' రెండో రోజు వర్క్‌షాప్‌లో ఆమె ప్రసంగించారు. లింగ భేదం వల్ల సమాజంలో మహిళల సహజ ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతోందని.. దీనిని ఎలా అధిగమనించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లిటరసీ, సోషల్ మీడియా అంశంపై ముంబయికి చెందిన అహన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సోనాలి పాటంకర్ ప్రసంగించారు. మహిళలపై సైబర్ దాడులు, నేరాలకు సంబంధించిన రిపోర్టింగ్ మెకానిజం, సోషల్ మీడియా ప్రొఫైల్‌ను సురక్షితం చేసే మార్గాలను వివరించారు. నెగోషియేషన్‌లో లింగ అంతరాలను తగ్గించడం అనే అంశంపై అహ్మదాబాద్‌కు చెందిన అంతర్దిషా ఐఐఎం అధ్యక్షురాలు ఇందిరా జైపారిక్ మాట్లాడారు. వివిధ స్థాయిల్లో మహిళల భాగస్వామ్యం, ప్రాతినిధ్యం పెంచే వ్యూహాలు, అభ్యాసాలను గుర్తించడం, అమలు చేయడంపై దృష్టి సారించాలని జీఎస్‌యూ వీసీ శాంతి శ్రీ పిలుపునిచ్చారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, అసోం, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రాగులపై ఫోకస్!

- చిరుధాన్యాల సంవత్సరంలో జిల్లాలో వీటికి ప్రాధాన్యం
- మద్దతు ధర ప్రకటనతో రైతుల్లో ఆసక్తి పెరిగే అవకాశం
- వచ్చే ఖరీఫ్‌లో మరిన్ని 'చిరు' పంటల సాగుకు ఆస్కారం



రాగుల పంట

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించిన నేపథ్యంలో ఒక్కో జిల్లాలో ఒక్కో చిరుధాన్యం పంట సాగుపై ఫోకస్ పెట్టారు. ఇందులోభాగంగా విశాఖపట్నం జిల్లాలో రాగుల సాగుకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. ఈ జిల్లాలో రబీ సీజనులో రాగుల సాధారణ విస్తీర్ణం 625 ఎకరాలుంది. ఇప్పటివరకు 500 ఎకరాల్లో రాగుల సాగయింది. త్వరలో మరికొంత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. చిరుధాన్యాల సంవత్సరంలో సాగు చేసే ఈ మిల్లెట్స్‌కు ప్రభుత్వం ప్రోత్సాహకాలిస్తుంది. ఇందుకోసం క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో క్లస్టరులో 250 ఎకరాలు అవసరమవుతుంది. జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో రాగుల సాగుకు అనువైన భూమి లభ్యత లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో పెందుర్తి, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలున్నాయి. వీటిలో ఒక్క పద్మనాభం మండలంలోనే వ్యవసాయ భూములు అధికంగా ఉన్నాయి. మిగిలిన మండలాల్లో పట్టణీకరణతో సాగు భూముల విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు పద్మనాభం మండలం బాందేవుపురాన్ని రాగుల సాగు క్లస్టర్‌గా ఎంపిక చేశారు. అక్కడ కనీసం వంద ఎకరాల్లో రాగుల సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండించిన రాగులను ధాన్యం మాదిరిగానే పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు చేయనున్నారు. అంతేకాదు.. అంగన్‌వాడీ కేంద్రాలు, చౌకధరల దుకాణాలకు వీటిని సరఫరా చేస్తారు. అందువల్ల రైతులకు మార్కెట్‌కు తరలించి అమ్ముకోవలసిన అవసరం, అవస్థలు ఉండవు. వచ్చే ఖరీఫ్‌లో మరిన్ని చిరుధాన్యాల పంటల సాగును పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మద్దతు ధర రూ.3,500

రాగులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాగులకు కనీస మద్దతు (ఎంఎస్‌పీ) ధర క్వింటాలుకు రూ.3,500గా ప్రకటించారు. గతం కంటే కనీస మద్దతు ధర పెరగడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉండనుంది. రాగుల సాగును పెంచేందుకు పెట్టుబడి రాయితీనిచ్చి ప్రోత్సహిస్తోంది. ఇన్‌పుట్స్ సబ్సిడీ కింద హెక్టారుకు రూ.6 వేల విలువైన విత్తనాలు, పురుగు మందులు, పొటాష్ వంటివి ఇస్తుంది. ఇవన్నీ రాగుల సాగు విస్తీర్ణం పెరగడానికి దోహద పడనున్నాయి. రాగుల సాగు క్లస్టర్‌గా ఎంపికైన బాందేవుపురంలో ఇటీవల వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం చేపట్టారు.

రాగులతో ప్రయోజనాలివీ..

రాగుల్లో కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రొటీన్లతో పాటు తక్కువ కొవ్వు, బరువు తగ్గించే గుణం, ఎముకల పటిష్టత పెంపు, బ్లడ్ కొలస్ట్రాల్, రక్తహీనత, మధుమేహాలను నియంత్రించే గుణం వంటివి ఉన్నాయి.

అంగన్‌వాడీల్లో స్మార్ట్ సేవలు

- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఫోకస్
- పౌష్టికాహారం పంపిణీలో మరింత పారదర్శకత
- ప్రత్యేక యాప్‌లో సేవలన్నీ నిక్షిప్తం
- రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా పర్యవేక్షణ



ధర్మానగర్‌లో గుర్తింపు కార్డులు చూపిస్తున్న గర్భిణులు, బాలింతలు

సంక్షిప్త సమాచారం

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	04
జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	776
సేవలందుకుంటున్న గర్భిణులు	7,779
బాలింతలు	7,621
6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు పిల్లలు	50,796
3-6 సంవత్సరాల పిల్లలు	10,960
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	221

విశాఖ విద్య: మాతా-శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు విశేష సేవలందిస్తున్నాయి. ఈ కేంద్రాలు మరింత పారదర్శకమైన సేవలందించేలా ప్రభుత్వం తాజాగా చేసిన ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. జిల్లాలోని 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 20 మంది సూపర్ వైజర్లకు ఇటీవల స్మార్ట్‌ఫోన్లు అందజేసింది. కేంద్రాల్లో అందించే అన్ని రకాల సేవలను వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేసేలా వీటిని వినియోగిస్తున్నారు. సూపర్‌వైజర్లు మొదలుకొని, స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ స్థాయి అధికారుల వరకు యాప్ ద్వారా ప్రతి రోజూ కేంద్రాలను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు లబ్ధిదారులకు ప్రతి నెలా ఇంటికి ఇచ్చే రేషన్(టీహెచ్ఆర్) సరకుల్లో నాణ్యతకు పెద్ద పీట వేస్తూ.. త్వరలోనే మార్క్‌ఫెడ్ ద్వారా సరకులు సరఫరా చేయనున్నారు.

'సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యమస్తు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీల నిర్వహణపై దృష్టి సారించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసమని రుచికరమైన పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరిట గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం, ఒక గుడ్డు, 200 మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నారు. అదే విధంగా టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్) కింద నెలకు పోషణ కిట్(కేజీ రాగిపిండి, కేజీ సజ్జ పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాములు ఎండి ఖర్జూరం, చెక్కీలు) అందజేస్తున్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్, 25 గుడ్లు, 2.5 లీటర్ల పాలు ఇస్తున్నారు. సచివాలయ ఏఎన్ఎంలు రెగ్యులర్‌గా కేంద్రాలను సందర్శించి ఆరోగ్యపరమైన సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

అందరికీ పౌష్టికాహారం అందేలా..

విశాఖ పట్నం జిల్లాలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కలిపి 84,032 మంది లబ్ధిదారులు నమోదుకాగా, ఇందులో 77,156 మంది సేవలు పొందుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో 91.80 శాతం మంది కేంద్రాల్లో సేవలు అందుకుంటున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో నూరుశాతం లక్ష్యం సాధించేలా అధికారులు ఫోకస్ పెట్టారు.

స్మార్ట్‌ఫోన్లతో సకాలంలో సమాచారం



కేంద్రాల కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు స్మార్టుఫోన్లు అందించాం. కేంద్రాల్లో నమోదైన వారందరికీ పౌష్టికాహారం అందించాలని కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. నూరుశాతం లక్ష్యం సాధించేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రాలను తరచూ తనిఖీ చేస్తున్నాం. మార్క్‌ఫెడ్ ద్వారా సరకుల సరఫరాపై ఏర్పాట్లు జరుగుతున్నాయి.

–డి.వెంకటేశ్వరి, ప్రాజెక్టు అధికారి, విశాఖ జిల్లా

గతంలో కంటే సేవలు పెరిగాయి



కేంద్రాల్లో గతంలో కన్నా సేవలు బాగా పెరిగాయి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా ఏ రోజుకారోజు వివరాలను నమోదు చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సరకులు కూడా సకాలంలోనే కేంద్రాలకు వస్తున్నాయి. ఆట వస్తువులు ఇటీవలే వచ్చాయి. ఇవి ప్రీ స్కూల్ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

–కె.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ఇందిరానగర్

క్లుప్తంగా

ప్రజా సంక్షేమానికి కృషి చేయండి

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అల్లిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సచివాలయ ఉద్యోగులు ప్రజా సంక్షేమానికి కృషి చేసి, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. సచివాలయ ఉద్యోగులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని గుర్తు చేశారు. ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్‌కుమార్, విశాఖ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీ అశోక్‌కుమార్, అనిరెడ్డి రమణ, కర్రి రాజేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

‘సీఎంఏ’తో ఉజ్వల భవిష్యత్

విశాఖ విద్య: సీఎంఏ కోర్సు అభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెన్నై పోర్ట్ అథారిటీ ఆర్థిక సలహాదారుడు, ప్రధాన ఖాతాల అధికారి డి.రమణమూర్తి అన్నారు. నగరంలోని సీఎంఏ భవన్‌లో తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంచుకున్న రంగంలో విజయ శిఖరాలను అధిరోహించేందుకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఒక చాలెంజ్‌గా తీసుకొని కష్టపడి చదివితే సీఎంఏ కోర్సు సకాలంలో పూర్తి చేయవచ్చన్నారు. భవిష్యత్‌లో సీఎంఏలకు మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఎంఏ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు హరినారాయణ, ఉపాధ్యక్షుడు రామారావు, కార్యదర్శి యు.లక్ష్మణరావు, మాజీ అధ్యక్షులు రామ్ ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.











అలరించిన పెట్ ఫెస్ట్-2023



• శునకాల షోకు

బీచ్‌రోడ్డు: సరైన రీతిలో శునకాల పెంపకం చేపడితే.. అవి చూపే విశ్వాసం, వాటి ద్వారా వచ్చే ఆనందం అద్భుతంగా ఉంటుందని రాష్ట్ర ఐటీ శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మార్షల్స్ పెట్ జోన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీఎం పార్క్ ప్రాంగణంలో పెట్ ఫెస్ట్–2023 పేరుతో డాగ్ షో నిర్వహించారు. ఈ షోను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ రాజధాని కాబోతున్న విశాఖలో ఇటువంటి కార్యక్రమాలు ద్వారా ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. వందల సంఖ్యలో జంతు ప్రేమికులు తమ శునకాలతో ఈ షోలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. శునకాలు ఎంతో విశ్వాసం చూపుతాయని.. వాటిని సరిగ్గా పెంచుకుంటే మనకు భద్రతనిస్తాయన్నారు. అభిన మార్షల్స్ పెట్ జోన్ వ్యవస్థాపకుడు ఎండీ భాషా మాట్లాడుతూ ఈ డాగ్ షోలో 54 రకాల జాతులకు చెందిన 650 శునకాలు పాల్గొన్నాయని వెల్లడించారు. ఏటా ఏటా డాగ్ షో నిర్వహిస్తున్నామని.. ఈ ఏడాది ఎక్కువ మంది తమ శునకాలను షోకు తీసుకొచ్చారని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ఏడీ సింహాచలం, డాక్టర్ పెద్ద సోములు, భాషా మృణాళిని తదితరులు పాల్గొన్నారు.





జీవితం అంటే ఇంతేనా?

- ఎన్నో అనాథ శవాలకు అంత్యక్రియలు
- 15 ఏళ్ల పాటు కాటికాపరిగా సేవలు
- నేడు అనాథ శవంలా కేజీహెచ్ మార్చురీలో..



పైడిరాజు (ఫైల్)

దాబాగార్డెన్స్: జీవితం అంతుచిక్కని మలుపుల వింత ప్రయాణం. ఏ పయనం ఎక్కడ మొదలవుతుందో.. ఎప్పుడు ఎక్కడ ఎలా ముగిసిపోతుందో అంచనా వేయడం అసాధ్యం. కొందరికి బతుకు వేడుకైతే.. మరికొందరికి వేదన. కొందరి ప్రస్థానం చరిత్రలో నిలిచిపోతే.. మరికొందరి బతుకంతా అజ్ఞాతమే.. ఆ అనాథ యువకుడి జీవితం రెండో కోవకే చెందుతుంది. శ్మశానమే సర్వస్వమైన అతడిని.. అక్కడకు చేరువులోనే సంచరించిన మృత్యువు తిరిగిరాని లోకాలకు తీసుకుపోయింది. అతను ఎన్నో అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించాడు. నేడు ఆ యువకుడి మృతదేహం కేజీహెచ్ మార్చురీలో అనాథ శవంలా ఉంది.

కాన్వెంట్ జంక్షన్ సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో పోలిపల్లి పైడిరాజు(35) 15 ఏళ్లుగా సేవలందిస్తున్నాడు. నగరానికి చెందిన వాడే అయినా.. ఆలనాపాలనా చూసేవారెవరూ లేకపోవడంతో అక్కడా ఇక్కడా కాలం గడిపి చివరికి శ్మశానానికి చేరుకున్నాడు. పైడిరాజు చిన్న వయసులోనే తల్లిదండ్రులిద్దరూ మృతి చెందారు. అన్నయ్య ఉన్నా.. అతడికి దూరంగా ఉంటున్నాడు. శ్మశానంలో పని చేస్తున్న మరికొందరితో కలిసి ఉంటున్నాడు. పైడిరాజు సేవ విలువకట్టలేనిది. అనాథలు.. అభాగ్యులే కాదు. డబ్బున్న వారెందరికో తనే తలకొరివి పెట్టాడు. కుమారులు, కుమార్తెలు విదేశాల్లో ఉండి.. ఇక్కడకు రాలేని పరిస్థితిలో ఎందరో తల్లులు.. తండ్రులకు తనే కుమారుడిగా తలకొరివి పెట్టిన రోజులెన్నో. గతేడాది సురేష్ అనే కూలీ అనారోగ్యానికి గురయ్యాడు. పనిచేసే ఓపిక నశించడంతో.. గత్యంతరం లేక యాచక వృత్తిలో పడ్డాడు. సురేష్‌కు ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందాడు. అనాథ శవంగా మిగిలిపోయిన సురేష్‌కు అతని కుమారుడి చేతుల మీదుగా పైడిరాజు అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది అభాగ్యులు.. అనాథలకు అన్నీ తానై అంతిమ సంస్కరణలు నిర్వహించాడు. ఎంతో మందికి పాడి కట్టాడు. నా అనే వారు లేక చనిపోయిన వారిని ఊరేగిస్తున్న క్రమంలో విసిరిన డబ్బులకు పైడిరాజు అలవాటు పడ్డాడు. ఆ వచ్చే డబ్బులతో పూట గడిచేది. అలా శ్మశానవాటికకు చేరువయ్యాడు. ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై.. అర్ధాంతరంగా తనువు చాలించాడు.



విదేశాల్లో ఉన్న పిల్లలు రాలేకపోవడంతో ఓ వ్యక్తికి అన్నీ తానై తలకొరివి పెడుతున్న పైడిరాజు(ఫైల్)

సేవలతో జన్మదిన వేడుకలు

- ఘనంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ పుట్టిన రోజు వేడుకలు
- పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు, సేవాకార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న అభిమానులు, చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం: ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పలు చోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శివాజీపాలెంలో గల వంశీకృష్ణ నివాసంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబురావు, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, చొక్కాకుల వెంకట్రావ్‌తో పాటు జీవీఎంసీ కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో గల ప్రముఖులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల పెద్దలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హిడెన్ స్ప్రౌట్స్ స్కూల్లో దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్సీ వంశీకృష్ణ కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ఉదయం ఆయన రుషికొండలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి, ఈస్ట్‌పాయింట్ కాలనీ సాయి బాబా దేవాలయం, కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో ‘పాప్‌కార్న్’

దాబాగార్డెన్స్ : ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై సాయి, అవికాగౌర్ హీరో, హీరోయిన్లుగా భోగేంద్రగుప్తా నిర్మాణంలో మురళీ గంధం దర్శకత్వం వహించిన పాప్‌కార్న్ మూవీ ఈ నెల 10న విడుదలకానుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ సినిమాకి సంబంధించిన విశేషాలు తెలియజేసింది. దర్శకుడు మురళీగంధం మాట్లాడుతూ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా ఆడియన్స్‌కి ఓ కొత్త అనుభూతిని ఇస్తుందని తెలిపారు. సినిమా చాలా వరకు లిఫ్టులో కొనసాగుతుందన్నారు. హీరో, హీరోయిన్లు 18 గంటల పాటు ఒక లిఫ్ట్‌లో ఇరుక్కుపోతారని, ఈ క్రమంలో వారిద్దరి మధ్య జరిగిన సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని వెల్లడించారు. ఈ మూవీ అందర్నీ అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో సాయి మాట్లాడుతూ ప్రెజర్‌కుక్కర్, రాజహంస వంటి పలు చిత్రాల్లో హీరోగా చేశానని తెలిపారు. పాప్‌కార్న్ మూవీ తనకు చాలా పేరు తీసుకొస్తుందని చెప్పారు. హీరోయిన్ అవికాగౌర్‌తో తన కెమిస్ట్రీ చాలా బాగుంటుందని పేర్కొన్నారు. కుటుంబమంతా కలిసి చూసే విధంగా ఈ సినిమా ఉంటుందన్నారు. హీరోయిన్ అవికాగౌర్ మాట్లాడుతూ తన కెరీర్‌లోనే పాప్‌కార్న్ మూవీ ఒక ప్రత్యేకమైనదని చెప్పారు. దర్శకుడు అద్భుతంగా ఈ మూవీని తెరకెక్కించారని వివరించారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ తెలుగులో సరికొత్త కాన్సెప్ట్‌తో పాప్‌కార్న్ మూవీని తీయడం జరిగిందన్నారు. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారని చెప్పారు. ఇది వరకు తమ బ్యానర్ నెపోలియన్, పొలిమేర వంటి వినూత్న చిత్రాలను తీశామన్నారు.

సాగరతీరంలో సందడి :

బీచ్‌రోడ్డు: పాప్‌కార్న్ చిత్ర యూనిట్ ఆదివారం సాగరతీరంలో సందడి చేసింది. వైఎంసీఏ వద్ద ఉన్న ఓసియన్ ఎడ్జ్‌ను సందర్శించి అక్కడ ఆహార ప్రియులతో హీరోహీరోయిన్లు సాయి, అవికాగౌర్ ముచ్చటించారు.

షూటింగ్ బాల్ పోటీలకు 20 మంది ఎంపిక



షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన బాలురు, బాలికలు

తగరపువలస: చిట్టివలస హైస్కూల్ ఆవరణలో ఆదివారం జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 80 మంది పాల్గొనగా 20 మందిని ఎంపిక చేశారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్, బాపులపాడులో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగే 41వ ఆంధ్రప్రదేశ్ బాలురు, బాలికల సీనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారు. షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు అప్పారావు పాల్గొని ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విశాఖకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హతియా-మంగుళూరు మధ్య వీక్లీ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం హతియా–మంగుళూరు సెంట్రల్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠీ తెలిపారు. హతియా–మంగుళూరు సెంట్రల్ (08645) వీక్లీ స్పెషల్ హతియాలో ప్రతీ సోమవారం ఉదయం 4.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.43గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి బుధవారం తెల్లవారు 4.15గంటలకు మంగుళూరు సెంట్రల్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 6, 13, 20, 27 తేదీలలో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో మంగుళూరు సెంట్రల్(08646)లో ప్రతీ గురువారం తెల్లవారు 4 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి శనివారం తెల్లవారు 4.30గంటలకు హతియా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 9, 16, 23 మార్చి 2 తేదీల్లో నడుస్తుంది.

తీరంలో విద్యార్థి గల్లంతు



యువరాజ్

బీచ్‌రోడ్డు: సాగర తీరంలో యువకుడు గల్లంతయ్యాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచరపాలెంకు చెందిన చిన్నం యువరాజ్ (16) ఆదివారం స్నేహితులతో కలిసి బీచ్‌రోడ్డుకు వచ్చాడు. పార్క్ హోటల్ వెనుకవైపు సముద్రంలో స్నేహితులంతాంంతా స్నానాలకు దిగారు. సాయంత్రం 6 గంటల సమయంలో పెద్ద అలకు చిక్కుకొని యువరాజ్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న బీచ్ పోలీసులు గాలించినా ఫలితం లేకుండా పోయింది.

యువరాజ్ కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ కాలేజ్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యువరాజ్ గల్లంతైన విషయాన్ని పోలీసులు అతని తల్లిదండ్రులకు తెలియజేశారు.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు కోరారు.